**COMMUNIST PARTY OF INDIA (MARXIST)**

**ANDHRA PRADESH COMMITTEE**

H.No. 27-30-3, CPI(M) State Committee Office
Akulavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com

**విజయవాడ,**
**తేదీ : 20 సెప్టెంబర్, 2017.**

**శ్రీయుత నారా చంద్రబాబునాయుడు గారికి,**
గౌరవ ముఖ్యమంత్రి,
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము,
అమరావతి.

**ప్రచురణార్థం:** సిపిఐ(యం) రాష్ట్ర కార్యదర్శి పెనుమల్లి మధు ముఖ్యమంత్రికి వ్రాసిన లేఖను ప్రచురణార్థం పంపుతున్నాం. – **జె.ప్రభాకర్,** ఆఫీస్ కార్యదర్శి

ఆర్యా!

**విషయం : రాష్ట్రంలో రొయ్యల చెరువులు, ఆక్వా ప్రాసెసింగ్ ప్లాంట్ల కాలుష్యాన్ని నివారించుటకు తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ...**

రాష్ట్రంలోని కోస్తా జిల్లాల్లో రొయ్యల సాగు విస్తారంగా జరుగుతోంది. కోస్టల్ ఆక్వాకల్చర్ ఆథారిటీ నిబంధనలు, అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వ జి.వో.లు 7,15 మున్నగువాటిని యధేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారు. కాలుష్యంవల్ల ప్రజలకు తాగడానికి రక్షిత మంచినీరు కూడా దొరకడం లేదు.

జి.వో 15 – నిబంధన 3.8 ప్రకారం రొయ్యల చెరువుల నుండి వదిలిన మురుగునీటిని ఎఫ్లుయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంటులో శుద్ధిచేసిన తరువాతనే బయటకు వదలాలి. కాని అవి ఎక్కడా ఏర్పాటు చేయనేలేదు. బయటకు విడిచే నీటి నాణ్యత (పిహెచ్ విలువ, రసాయన అవశేషాలు, నీటిలో ఆక్సిజన్, ఇతర వాయువుల స్థితి మొ॥) సిఎఎ, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ బోర్డు ప్రమాణాల మేరకు ఉండాలి. కాని అవేవీ అమలుకావడం లేదు. చేపలు, రొయ్యల చెరువు వద్ద అనుమతి పత్రాన్ని అందరికీ కనిపించే విధంగా బోర్డుపై ప్రకటించాలని నిబంధన వుంది. రాష్ట్రంలో ఎక్కడా అలాంటి బోర్డులు పెట్టడంలేదు. చేపలు, రొయ్యల చెరువు త్రవ్వేందుకు ఆ చుట్టు ప్రక్కలగల రైతుల అభ్యంతరాలను 15 రోజుల్లోగా తెలియజేయాలని కోరుతూ సంబంధిత గ్రామ పంచాయతీ నోటీసు బోర్డులో, ఇతర బహిరంగ ప్రదేశాల్లో ప్రదర్శించాలి. అభ్యంతరాలు వచ్చినట్లైతే వాటిని పరిష్కరించాకే జిల్లా స్థాయి కమిటీ అనుమతివ్వాలి. కానీ అలా జరగడం లేదు. చేపల చెరువులకు అనుమతులు పొంది, అక్రమంగా రొయ్యలు పెంచుతున్నారు. ఆక్వా ప్రాసెసింగ్ ప్లాంట్ల మూలంగా పరిసర గ్రామాలకు ప్రాణాంతకమైన కాలుష్యం కలుగుతోంది. భద్రతా చర్యలు తీసుకోకపోవడంవల్ల వాటిలో పనిచేసే కార్మికులు ప్రమాదాల్లో మరణిస్తున్నారు. చాలామంది తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారు.

రొయ్యల సాగు కారణంగా వస్తున్న కాలుష్యంపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన సైంటిస్టుల కమిటీ సిఫార్సులు చేసి మూడు నెలలు దాటినా వాటిని అమలు చేయడం లేదు.

రొయ్యలసాగు, ఆక్వా ప్రాసెసింగ్ ప్లాంట్ల వల్ల ఏర్పడుతున్న కాలుష్యా న్ని నివారించేందుకు క్రింది చర్యలు చేపట్టవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం.

"త్రిప్పి చూడగలరు"

(1) ఆక్వా సాగుపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఎక్స్‌పర్ట్స్ కమిటీ సిఫార్సులను వెంటనే అమలు చేయాలి.

(2) అనుమతి లేని రొయ్యల చెరువుల్ని తొలగించాలి. కాలుష్య కారకాలయిన రొయ్యల చెరువుల త్రవ్వకాలను నివారించాలి.

(3) ప్రతి రొయ్యల చెరువు వద్ద వ్యర్థాలను శుద్ధిచేసే వ్యవస్థ (ఎఫ్లూయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్) ఏర్పాటు చేయాలి. వ్యర్థ జలాలను కాలుష్య నియంత్రణా మండలి ప్రమాణాలకు లోబడి మాత్రమే వదిలేలా చర్యలు చేపట్టాలి.

(4) సిఏఏ/ డిఎల్‌సి ఇచ్చిన అనుమతి పత్రాన్ని అన్ని వివరాలతో చేపలు, రొయ్యల చెరువు వద్ద బోర్డుపై విధిగా ప్రదర్శించేలా చర్యలు చేపట్టాలి.

(5) రొయ్యల చెరువుల్లో బోర్లను అనుమతించరాదు. ఇప్పటికే ఉన్నవాటిని తొలగించాలి. సెలినిటీ పెంచడంకోసం ఉప్పు వేయడాన్ని నిషేధించాలి.

(6) ఊపిరితిత్తులు, చర్మ సంబంధిత వ్యాధులతో సహా ఇతర వృత్తి రుగ్మతలకు సంబంధించి కార్మికులందరికీ వైద్య పరీక్షలు చేయించి, యాజమాన్యం ఖర్చుతో వైద్యం చేయించాలి.

(7) చెరువుల్లో కలిపివేసిన (దురాక్రమణ చేసిన) ఎస్సీ, ఎస్టీ, బిసిలకు చెందిన డి-పట్టా, ప్రభుత్వ భూములను పేదలకు అప్పగించాలి.

(8) పొల్యూటర్స్‌పే నియమాన్ని అనుసరించి రొయ్యల చెరువుల మూలంగా పంట నష్టపోయిన రైతులకు, కౌలుదార్లకు నష్టపరిహారాన్ని ఆయా చెరువుల యాజమానులనుండి ప్రభుత్వం ఇప్పించాలి.

(9) చేపలు, రొయ్యల చెరువులకోసం దరఖాస్తు వచ్చిన వెంటనే గ్రామసభ నిర్వహించాలి. ఆ భూమి చుట్టుప్రక్కల గల రైతులకు, కౌలుదార్లకు వ్రాతపూర్వక సమాచారాన్నిచ్చి వారి అభిప్రాయాలను/ అభ్యంతరాలను నమోదు చేయాలి. ప్రజల అభ్యంతరాలను పరిష్కరించాక డిఎల్‌సి భూములను పరిశీలించాలి. అనంతరమే ప్రాథమిక అనుమతిని మంజూరు చేయాలి.

(10) జనావాసాల సమీపంలో ఆక్వా ప్రొసెసింగ్ ప్లాంట్లను ఏర్పాటు చేయరాదు. తుందుర్రు ఆక్వా పార్కు రద్దు చేయాలి. ఇప్పటికే ఉన్న వాటిని సుదూర ప్రాంతాలకు తరలించాలి.

(11) మంచినీటి వనరులు, డ్రెయిన్‌లలోకి ఆక్వా నీటిని ఎట్టి పరిస్థితుల్లో అనుమతించరాదు.

(12) చేపలు, రొయ్యల ప్రొసెసింగ్ ప్లాంట్లలో పనిచేసిన వారికి పూర్తిస్థాయి భద్రతా సౌకర్యాలు (సేఫ్టీ మెజర్స్) కల్పించాలి. కనీస వేతనాలు, పిఎఫ్, ఇఎస్ఐ మొ॥ అమలు చేయాలి.

**అభివందనములతో...**

**(పెనుమల్లి మధు)**

రాష్ట్ర కార్యదర్శి